## వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రులు


ఓషు వెల్నెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు

**గచ్చిబౌలి:** ఒకే వేదికపై యోగ, జిమ్, వెల్నెస్ సెంటర్‌ను 'ఓషు వెల్నెస్' పేరిట అందుబాటులోకి తీసుకొచ్చారు. గచ్చిబౌలిలో గురువారం రాష్ట్ర రోడ్ల భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓషు వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఐటీ ఉద్యోగులకు ఇలాంటి కేంద్రాల ద్వారా ఒత్తిడికి ఉపశమనం అని ఓషు వెల్నెస్ ఎం.డి. డాక్టర్ సంధ్య పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో మంత్రులతో పాటు సినీ నటి డింపుల్ హయతి, హీరో వెంకట్, గీతా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యనగర్‌లో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ

**హఫీజ్‌పేట్:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మాదాపూర్ డివిజన్‌లోని ఆదిత్యనగర్ సెయింట్ ఐజాక్ అడ్వెంట్ హై స్కూల్‌లో దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పాల్గొన్నారు. స్కూల్ చైర్మన్ కమర్‌జహాన్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో మినీ అబ్జర్వేటరీ కేంద్రం ఏర్పాటు


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు, పూర్వవిద్యార్థులు

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మినీ అబ్జర్వేటరీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ పూర్వ విద్యార్థుల జ్ఞాపకార్థం దీన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగం 1986 పూర్వ విద్యార్థి డాక్టర్ నందివాడ రత్నశ్రీ పేరు మీద మినీ అబ్జర్వేటరీని ఏర్పాటు చేశారు. ఆమె 2021 వరకు న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ ప్లానిటోరియం డైరెక్టర్‌గా పని చేశారు. ఆతర్వాత కోవిడ్ సమస్యలతో ఆమె మృతి చెందారు. దీంతో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ కొత్త భవనం టెర్రస్‌పై మినీ అబ్జర్వేటరీని ఏర్పాటు చేశారు. దీన్ని హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు చేతుల మీదుగా బుధవారం రాత్రి ప్రారంభించారు. పూర్వ విద్యార్థి డాక్టర్ నందివాడ రత్నశ్రీ జ్ఞాపకార్థం ఈ అబ్జర్వేటరీకి పేరు పెట్టారు.

## కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రి వైద్యుల అరుదైన చికిత్స



**గచ్చిబౌలి:** అరుదై శస్త్ర చికిత్స ద్వారా గుండెలోని మూడు ప్రధానమైన వాల్వులను మార్చి యువతి ప్రాణాలను కొండాపూర్ కిమ్స్ హస్పిటల్ డాక్టర్లు కాపాడారు. మియాపూర్‌ప్రాంతానికి చెందిన మీనా అనే యువతి ఆయాసంతో నాలుగు అడుగులు వేయలేని పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చారు. పరీక్షలు చేసిన కిమ్స్ ఆస్పత్రి వైద్యులు మూడు వాల్వులలో లీకేజీ ఉందని గుర్తించారు. గతంలోను ఆమెకు మైట్రల్ వాల్వు మార్పిడితో పాటు ట్రైకు వాల్వుకు మరమ్మత్తులు చేశారు. టిష్యూ వాల్వులు పాడైపోవడంతో కిమ్స్ డాక్టర్ విసర్గ బృందం శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. 9 గంటల పాటు నిర్విరామంగా శస్త్ర చికిత్స చేసి మెకానికల్ వాల్వుతోనే మైట్రల్, ట్రైకు స్పీడ్, అయోటిక్ వాల్వులను మార్చారు. దాంతో పాటు హైపర్ టెన్షన్‌కు చికిత్స చేశారు. శస్త్ర చికిత్స చేసిన రెండో రోజే మీనా నడవడం మొదలు పెట్టారు. డాక్టర్ విసర్గ మాట్లాడుతూ గుండె శస్త్ర చికిత్సలో ఎన్నో సరికొత్త మార్పులు వస్తున్నాయన్నారు. మెకానికల్ వాల్వుతోనే అద్భుతాలు సృష్టించగల్గుతున్నామని ఆయన పేర్కొన్నారు.

## విద్యారంగం-పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తాం

**'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్**



**రాయదుర్గం:** విద్యారంగం-పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్‌ఐనుల్ హసన్ పేర్కొన్నారు . 'జష్న్-ఏ-బహారస్' ఉత్సవాల్లో భాగంగా గురువారం యూనివర్సిటీలో చివరి సెమిస్టర్ చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జాబ్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ ఫెస్ట్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. చివరి సెమిస్టర్ విద్యార్థులు వృత్తిపరమైన రంగంలోకి సజావుగా మారడానికి జాబ్‌ఫెస్ట్ కీలకమైన వేదికగా ఉపయోగపడాలనే లక్ష్యంతో ఈ ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. జాబ్‌ఫెస్ట్‌లో 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

# సరిహద్దులు చెరిపివేయాలి


మాట్లాడుతూన్న ప్రొఫెసర్ నీలిమ

**పటాన్‌చెరు టౌన్:** ఇంజనీరింగ్ విభాగాల మధ్య సరిహద్దులను చెరిపివేయాలని, సంక్లిష్ట వ్యవస్థల్లోని వివిధ కారకాలు, పరస్పర చర్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేయాలని మణిపాల్, ఎంఐటీలోని సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలియా సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేథ యుగంలో అంతర్ విభాగ పరిశోధన, హెచ్‌పీసీ' అనే అంశంపై గురువారం ఆమె మాట్లాడారు. కృత్రిమ మేథ యుగంలో సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవడంలో, ఆవిష్కరణలను నడపడంలో అంతర్ విభాగ సహకారం ప్రాముఖ్యత గురించి ఆమె వివరించారు. తమ భవిష్యత్తు కోసం ఈసీఈ విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్‌శాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి, ప్రొఫెసర్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.72.90 లక్షలు మాయం

**ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి**

**పటాన్‌చెరుటౌన్ :** నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని ఏఆర్ బృందావన్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గతేడాది డిసెంబర్ 28వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి ఓ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. అనంతరం నిర్వాహకులు బాధితుడికి ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21 తేదీన అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఓ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో సదరు ఉద్యోగి అప్పులు చేసి మరీ ఆన్‌లైన్‌లో 16 దఫాలుగా రూ.72.90 లక్షలు నగదు ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. కొద్ది రోజులకు తాను పెట్టిన నగదుతో పాటు వచ్చిన లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


# నైట్ బజార్‌కు మహర్దశ


మాదాపూర్‌లోని నైట్‌బజార్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్

- మూడు ఎకరాలలో 119 స్టాల్స్, ఒక స్టేజి తో నైట్‌బజార్
- నిరుపయోగంగా ఉన్న నైట్ బజార్‌ను వాడుకలోకి తేనున్న అధికారులు.
- 119 స్టాల్స్‌ను స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయింపు
- నైట్‌బజార్ గోడలపై ఆకట్టుకుంటున్న చిత్రాలు

**మాదాపూర్:** మాదాపూర్ శిల్పారామంలో వద్ద ఏర్పాటు చేసిన నైట్‌బజార్ నిరుపయోగంగా మారింది. మూడు ఎకరాలలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నైట్‌బజార్ చేనేత, హస్త కళా కారులతో పాటు మరిన్ని ఉత్పత్తులు తయారు చేసి అమ్మకాలు జరుపుకునే వారికి కేటాయించారు. నాలుగు భాగాలుగా (ఆధునిక జోన్, సుల్తానేట్, అజ్‌మా, వేదిక్ జోన్)లుగా ఏర్పాటు చేసిన నైట్‌బజార్ సందర్శకులను ఆకట్టుకునేందుకు శని, ఆది వారాలలో శిల్పారామంతో పాటు నైట్ బజార్ స్టేజిపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వీటితో పాటు ఫుడ్ ఫెస్టివల్స్‌లతో పాటు వినూత్న పద్ధతిలో నైట్ బజార్‌ను అభివృద్ధి చేసేందుకు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించారు. కళా కారులకు వ్యాపారం చేసుకునేందుకు స్టాల్స్‌ను అధికారులు కేటాయించారు. కొంతకాలం తరువాత అద్దె కట్టడం లేదని కోర్టు ద్వారా ఖాళీ చేయించారు. అప్పటి నుంచి నైట్ బజార్ నిరుపయోగంగా మారింది. రాత్రి సమయాలలో సందర్శకులను ఆకట్టుకునే విధంగా, ఐటీ ప్రాంతం కావడంతో వారు సేద తీరేవిధంగా స్టాల్స్, రెస్టారెంట్‌లను ఏర్పాటు చేసినప్పటికి అది కొంతకాలానికే పరిమితం అయ్యింది.

- నైట్‌బజార్‌లో షాపింగ్‌కి వచ్చిన వారికి చిన్నపిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేకంగా చిన్నారుల జోన్‌ను ఏర్పాటు చేశారు. అది వాడుకలో లేకపోవడం వల్ల చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వస్తువులు అన్ని పాడయిపోయాయి.


గోడలపై ఆకట్టుకుంటున్న చిత్రాలు

- సందర్శకులను ఆకట్టుకునేందుకు వాటర్ ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేసినప్పటికి నిరుపయోగంగా మారింది. నిర్వాహణ లేక పోవడం వల్ల ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారంతో నైట్‌జబార్ చీద్రంగా మారింది.

**సీఎం ఆదేశం మేరకే..**

- శిల్పారామం ప్రక్కన నిరుపయోగంగా ఉన్న నైట్‌బజార్‌ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డి ఇటీవలే సందర్శించారు.
- మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహయక సంఘాల మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాటు చేయాలని అదికారులకు ఆదేశం ఇచ్చారు.
- 2017 నుంచి నిరుపయోగంగా ఉన్న నైట్ బజార్ లోని 119 స్టాల్స్‌ను మహిళలు మార్కెటింగ్ చేసుకునేందుకు కేటాయించనున్నారు.
- రైతు బజార్‌ల స్వయం సహాయక మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా స్టాల్స్‌ను తీర్చిదిద్దనున్నారు.
- పూర్తిగా మహిళలకు మాత్రమే స్టాల్స్‌ను కేటాయించనున్నారు.
- సంబందిత శాఖల సమన్వయంతో పనులను వేంటనే చేసి మహిళలకు స్టాల్స్ అందించనున్నారు.



నిరుపయోగంగా ఉన్న స్టేజి, వాటర్ ఫౌంటైన్

## ట్రిపుల్‌ఐటీ విద్యార్థికి చాణక్య ఫెలోషిప్


జ్యువెల్ బెన్నీ

**రాయదుర్గం:** ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధక విద్యార్థి జ్యువెల్ బెన్నీకి మాస్ హెల్త్ కేర్ మానిటరింగ్ సొల్యూషన్ కోసం చాణక్య ఫెలోషిప్‌ను గెలుచుకున్నారు. ఒకేసారి బహుళ రోగుల హృదయ స్పందన రేటు, శ్వాసరేటును గుర్తించడం గురించి ఆలోచించేలా చేశారు. రాడార్ ఆధారిత మాస్ మానిటరింగ్ సిస్టమ్‌ను అండర్ గ్రాడ్యుయేట్ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధకుడు జ్యువెల్ బెన్నీకి అవకాశం లభించింది. అతనికి ఐహబ్ అనుభూతి ట్రిపుల్‌ఐటీ ఢిల్లీ ఫౌండేషన్ అందించే చాణక్య ఫెలోషిప్‌ను పొందడంలో సహాయపడింది.

## కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదలకు న్యాయం


సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. గురువారం నల్లగండ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ రాజీవ్ గృహకల్పకు చెందిన సీహెచ్ ఆంజనేయులుకు అత్యవసర వైద్య సహాయం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన రూ.1.30 లక్షల ఎల్‌ఓసీని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ అత్యవసర వైద్య సహాయానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

## ముగిసిన శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం



**మాదాపూర్:** మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న శ్రీస్వర సద్ధి వేంకటేశ్వరస్వామి శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం గురువారం ముగిసింది. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రత్నన్యాసం నిర్వహించారు. అనంతరం గోదాదేవులు, గరుడ, జయ విజయలు, వినాయక, నాగరాజు, ఆంజనేయ, నటరాజ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు డాక్టర్ శోభరాజు కళాకారులను సత్కరించారు.

## మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు



**మియాపూర్ :** మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షీ-టీం పోలీసులు తెలిపారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో షీ-టీం,సైబర్ నేరాల 100 డయల్ పై అవగాహన కల్పించారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని అన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, రామచంద్రయ్య, జంగమ్మ పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు



**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) విద్యార్థుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం కలిసింది. నగరంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ విభాగం నాయకులు కలిశారు. సీఎం చేతుల మీదుగా ఉగాది పర్వదిన వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరింప చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ ఇన్‌చార్జీ అజయ్, అధ్యక్షుడు నేహ జయరాజ్, కోఆర్డినేటర్ పట్లోళ్ళ శ్రీరామ్‌యాదవ్, షరీఫ్, రచన, సునీల్ పాల్గొన్నారు.

# విధులు బాధ్యతగా నిర్వహించాలి



**పటాన్‌చెరు టౌన్:** రాబోయే ఎన్నికల్లో పీఓలు, ఏపీఓలు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణా తరగతులకు 1397 మంది అధికారులు హాజరైనట్లు పేర్కొన్నా రు. వీరికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఈవీఎంల పనితీరు, పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నా రు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, తహసీల్దార్లు బిక్షపతి, రాధ, అధికారులు పాల్గొన్నారు.

**సీఎంఆర్‌ను పూర్తి చేయాలి....**

**పటాన్‌చెరు:** ధాన్యంను బియ్యం పట్టి త్వరగా అప్పగించాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ సమీపంలోని విజయలక్ష్మి పార్ బాయిల్డ్ రైస్‌మిల్లును ఆమె తనిఖీ చేశారు. వానాకాలంకు సంబంధించి విజయలక్ష్మి రైస్‌మిల్లుకు అప్పగించిన లక్షా 76 వేల 750 టన్నులు ధాన్యానికి గాను 13,746 టన్నుల బియ్యం అందించారని, మిగిలినవి త్వరితగతిన అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వనజ, కొండలరావు పాల్గొన్నారు.

**వేసవిలో అప్రమత్తంగా ఉండాలి**

పగటి ఉష్ణోగ్రతలు పెరిగినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాస్‌కు సూచించారు. డ్రింకింగ్ వాటర్ కంట్రోల్ రూం నంబర్ 08455 276155ను అందరికి తెలిసేలా ప్రదర్శించాలని ఆదేశించారు. ఉపాధి పనులు 12 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, ఎంపీడీఓ యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

**శేరిలింగంపల్లి:** నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 25, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 35, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 200.

## ట్రిపుల్‌ఐటీ లో టెక్ స్టార్టప్ కోహార్ట్ ప్రారంభం

**రాయదుర్గం:** ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో టెక్ స్టార్టప్ కోహార్ట్‌ను గురువారం పారంభించారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ), రాయల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ సంయుక్తంగా యూకే కోసం టెక్ స్టార్టప్ కోహార్ట్‌ను ప్రారంభించడం విశేషం. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల డొమైన్‌లలో 8 స్టార్టప్‌లు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో భారతదేశంలో మార్గదర్శకత్వం, యూకేలోని అవకాశాలు, పెట్టుబడిదారుల అన్వేషించుకోవడానికి దోహదపడుతుంది. సీఐఈ యూకే ప్రోగ్రామ్‌కు భారతీయ భాగస్వామిగా వ్యవహరిస్తుంది.

## న్యాక్‌కు అచీవ్‌మెంట్ అవార్డ్


అవార్డును అందుకుంటున్న న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ

**మాదాపూర్:** మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్) విశ్వకర్మ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా అచీవ్‌మెంట్ అవార్డు ఫర్ కన్‌స్ట్రక్షన్ అవార్డును న్యాక్ అందుకుంది. నిర్మాణ పరిశ్రమ అభివృద్ధి మండలి ప్రణాళిక సంఘం (సీఐడీసీ) 15వ అవార్డుల కార్యక్రమంలో భాగంగా న్యాక్‌కు అందించింది. 2023-24 లో 27,532 మందికి నిర్మాణ సంబంధిత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించినందుకు ఈ అవార్డును అందజేశారు.

## నల్లగండ్లలో చలివేంద్రం ప్రారంభం



**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నల్లగండ్లలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చందానగర్, నల్లగండ్ల, గచ్చిబౌలి ప్రాంతాల్లో లివేంద్రాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఘాలి కృష్ణ, విజయేందర్‌రెడ్డి, రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యాచకురాలు మృతి

**హఫీజ్‌పేట్ :** ఓ గుర్తు తెలియని వృద్ధ యాచకురాలు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. లింగంపల్లి ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ 6వ నెంబర్ ఫ్లాట్ ఫారం వైపు ఉన్న పార్కింగ్ స్థలంలో గుర్తు తెలియని యాచకురాలు (65) గురువారం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారు. మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## కష్టపడి పనిచేస్తే 400 సీట్లు బీజేపీకి ఖాయం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్

**గచ్చిబౌలి:** కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే దేశంలో బీజేపీకి 400 సీట్లు రావడం, మళ్ళీ నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి బీజేపీ డివిజన్ సమీక్షా సమావేశాన్ని మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేస్తే బీజేపీ గెలుపును చేవెళ్ళలో అడ్డుకోవడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. శేరిలింగంపల్లి చేవెళ్ళ పార్లమెంటు పరిధిలో అతిపెద్ద నియోజకవర్గం కావడంతో ఇక్కడే అత్యధిక మెజార్టీ సాధించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ పార్లమెంటు ఇన్‌చార్జి మల్లారెడ్డి, అనితారెడ్డి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

## 'పాటపై తూటా' సదస్సు

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో నిర్వహించనున్న 'పాటపై తూటా' సదస్సును విజయవంతం చేయాలని గద్దర్ కుమారుడు సూర్యం పిలుపునిచ్చారు. గురువారం తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 1997 ఏప్రిల్ 6న తన తండ్రిపై కాల్పులు జరిగిన రోజన్నారు. దానిని పురస్కరించుకుని శనివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్, మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు రవి, శ్రీనివాస్, సుదర్శన్, నగేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.